శుక్రవారం ၊ 26 ၊ మే ၊ 2023



ప్రథమ చికిత్సలో 'పైలెట్'
అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడటంతో 108 వాహనాల పైలెట్లదే కీలక పాత్ర. నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం. 8లో▸



సివిల్స్ ర్యాంకర్‌కు ఘనస్వాగతం
సివిల్స్‌లో 410 ర్యాంకు సాధించిన డోంగ్రి రేవయ్యకు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.7 /28.9

వాతావరణం
ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: బెస్ట్ అవెలేబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో మణెమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 48 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు జూన్ 2లోగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీటీజీ తెగకు ఆరు, ఏజెన్సీ గ్రామాల విద్యార్థులకు ఆరు, మిగిలిన సీట్లు గిరిజన విద్యార్థులతో రిజర్వేషన్ ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లోపు ఉండాలన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎం గోపాల్

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీఎం గోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్ పుస్తకం వెంట తెచ్చుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవో లావణ్య, ఏపీఎం కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

'లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు కరువు'

సిర్పూర్(టి): పెన్‌గంగాపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు కరువయ్యాయని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సిర్పూర్(టి) మండలంలోని మాకిడి, జక్కాపూర్, హుడ్కిలి, నవేగాం గ్రామాల్లో పల్లెపల్లెకు పాల్వాయి– గడపగడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌గంగ నదిపై ఉన్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆరోపించారు. రైతులకు సాగునీరందక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, హుడ్కులి ఉప సర్పంచ్ టింకె ఆనంద్, నాయకులు శ్యాంరావ్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తిదారులకు రూ.10లక్షలు అందించాలి

సిర్పూర్(టి): రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులపై ఆధారపడిన వారికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి తులసీదాస్ ఒక ప్రకటనలో కోరారు. తరతరాలుగా కుల వృత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వారిని ఆదుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోనే అత్యంత వెనుకబడి ఉన్నారని, పరిశీలించి ఆర్థికసాయం పెంచాలని డిమాండ్ చేశారు.

ఎంసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



సుప్రియ



ఆదె శైలజ

ఆసిఫాబాద్‌రూరల్: టీఎస్ ఎంసెట్‌- 2023 ఫలితాల్లో పలువురు జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన 34 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందరూ అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. కాగజ్‌నగర్‌లోని వివేకానంద కళాశాలకు చెందిన జాహ్నవి 95.55 మార్కులతో 3,034 ర్యాంకు సాధించింది. మెడికల్ /అగ్రికల్చర్ విభాగంలో మోడల్ స్కూల్‌కు చెందిన సుప్రియ 22,636 ర్యాంకు, పల్లవి 25,706 ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో సుస్మిత 31,825 ర్యాంకు సాధించారు.

వాంకిడి(ఆసిఫాబాద్): ఎంసెట్ ఫలితాల్లో వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. మెడికల్ విభాగంలో ఆదె శైలజ 57.02 మార్కులతో 27,534 ర్యాంకు సాధించింది. కళాశాల నుంచి 22 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 18 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ తెలిపారు.

ఆటలకు చోటేది..?

ఈ క్రీడా మైదానం కౌటాల మండలం మొగడ్‌ధగడ్ గ్రామంలోనిది. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి గతేడాది ఆగమేఘాల మీద దీనిని ప్రారంభించారు. రెండెకరాల్లో ఏర్పాటు చేసిన ఈ మినీ స్టేడియం బోర్డుకు మాత్రమే పరిమితమైంది. సౌకర్యాలు కల్పించపోవడంతో యువకులు మైదానానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.





పై ఫొటోలో కనిపిస్తున్న ప్రాంతం వాంకిడి మండలం ఖమాన గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలం. అధికారులు ఖమాన, గొల్లగూడ, పాటగూడ గ్రామాలకు ఏర్పాటు చేయాల్సిన క్రీడా ప్రాంగణాలకు ఇక్కడే స్థలం చూపించారు. ఈ ప్రాంతం గ్రామాలకు సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంటుంది. గ్రామ పంచాయతీ వారు సైతం అధికారులు చూపించిన ఈ స్థలాన్ని తిరస్కరించారు. యువతకు అందుబాటులో ఉండేలా స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. వాంకిడి మండలంలో ఇప్పటివరకు ఏ గ్రామానికి సరైన క్రీడాప్రాంగణం ఏర్పాటు కాలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

- అందుబాటులోకి రాని క్రీడా ప్రాంగణాలు
- జిల్లాలో పలుచోట్ల బోర్డుల ఏర్పాటుకే పరిమితం
- వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- గ్రామీణ క్రీడాకారులకు అందని ప్రోత్సాహం

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లా వ్యాప్తంగా సీఎం కప్ పోటీల నిర్వహణ, వేసవి క్రీడాశిబిరాలతో కొన్నిరోజుల పాటు పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా, మండల స్థాయి సీఎం పోటీల కోసం పలుచోట్ల భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలపై మాత్రం పట్టింపు కరువైంది. వసతులు లేమితో, గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతాల్లో స్థలాలను కేటాయించడంతో యువత మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క మండలంలోనూ పూర్తిస్థాయిలో వసతులతో మైదానాలను అందుబాటులోకి తీసుకురాలేదు.

జిల్లాలో క్రీడాప్రాంగణాల వివరాలు

మండలాలు	15
గ్రామ పంచాయతీలు	335
అనుబంధ గ్రామాలు	767
ఏర్పాటు చేయాల్సినవి	1,102
స్థల సేకరణ పూర్తయినవి	620
పూర్తయిన క్రీడా ప్రాంగణాలు	421

రూ.4లక్షలతో ఏర్పాటు..
జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు రూ.4లక్షల వరకు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్ జంప్, హైజంప్ వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలి. మైదానం చుట్టూ చెట్లు నాటాలి. కానీ క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తే ఎలాంటి సౌకర్యాలు కానరావడం లేదు. కొన్నిచోట్ల స్థలాల కొరత, మరి కొన్నిచోట్ల స్థల వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. పలుచోట్ల స్థలాలు లభించినా గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం క్రీడాప్రాంగణాల ఏర్పాటుపై దృష్టి సారించాలని క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువతకు వేసవిలోనే ఆటలు
గ్రామాల్లో ఆటస్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంలా మారుతోంది. స్థలాల కొరత పేరుతో గ్రామాలకు దూరంగా మైదానాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా వేసవిలో పంట పంటచేలను మైదానాలుగా మార్చుకుని ఆటలు ఆడుతున్నారు. జిల్లాలో పత్తి సాగు చేసిన చేలను మూడు నెలల పాటు రైతుల అనుమతితో చదును చేసుకుంటున్నారు.

మూడేళ్లుగా దూరం



మూడేళ్ల క్రితం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలోనే ఆడుకునే వాళ్లం. హైవే విస్తరణతో ఆ మైదానం కోల్పోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి సరైన స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. మండల కేంద్రంలో మైదానం ఏర్పాటు చేయాలని పలుమార్లు కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎంగిలి రాజేశ్, డైలీ క్రికెట్ యూత్ సభ్యుడు, వాంకిడి

సౌకర్యాలు కల్పించాలి



గ్రామ సమీపంలోనే క్రీడామైదానం కోసం స్థలం కేటాయించారు. బోర్డు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఎలాంటి వసతులు కల్పించలేదు. సెలవు రోజుల్లో ఆటలు ఆడుకునేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. అధికారులు క్రీడాప్రాంగణం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసి సౌకర్యాలు కల్పించాలి.

– చెల్లూరి ప్రశాంత్, బూరెపల్లి, మం.కౌటాల

'గంజాయి' దందాపై సీరియస్

- విచారణకు ఆదేశించిన పోలీసు బాస్
- రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ విభాగం
- ఉక్కిరిబిక్కిరి అవుతోన్న గంజాయి డాన్
- రాజకీయ పార్టీ నేతలను ఆశ్రయించిన వైనం

సాక్షి స్పందన



సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలోని మారుమూల గ్రామాల్లో కంది, పత్తి చేలల్లో ఓ పత్తి వ్యాపారి అంతర పంటగా గంజాయిని సాగు చేయిస్తూ అక్రమ దందా నిర్వహిస్తున్న వైనాన్ని పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'పత్తి వ్యాపారి అక్రమ దందా' అనే శీర్షికతో గంజాయి సాగుపై కథనం ప్రచురితమైన సంగతి విదితమే. ఆ కథనానికి జిల్లా పోలీసు బాస్ స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ వర్గాలు దందా వ్యవహారంపై ఆరా తీస్తున్నాయి. పత్తి వ్యాపారం ముసుగులో గంజాయి సాగు చేస్తున్న వ్యాపారి కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ముఖ్యంగా కెరమెరి మండలం సావర్‌ఖేడా, ఉమ్రి, నిషాని, దేవుడిపల్లి, గోయిగాం, ధనోరా, కోతారి, ఇందాపూర్ తదితర గ్రామాల్లోని రైతుల వద్ద పత్తి కొనుగోలు.. వారి పొలాల్లో పత్తి, కందితోపాటు ఇతర పంటల సాగు తదితర అంశాలపై ఆరా తీయడం మొదలెట్టారు. అలాగే అతనికి ఎక్కడెక్కడ స్థిరాస్తులు ఉన్నాయి? వాటి విలువెంత? ఇంత భారీ మొత్తం ఆదాయం ఏయే మార్గాల్లో సంపాదించారు? వంటి వివరాలను సైతం వివిధ మార్గాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిసింది. 'సాక్షి'లో వచ్చిన కథనంతో గంజాయి డాన్ బెంబేలెత్తిపోయినట్లు తెలుస్తోంది. వెంటనే తన అనుచరవర్గంతో కలిసి ఉదయమే జిల్లా కేంద్రంలో ఉన్న ఓ రాజకీయ పార్టీ సారథిని కలిసి.. తన పరిస్థితి వివరించి అండగా నిలవాలని కోరినట్లు సమాచారం. అదే విధంగా తన రియల్‌ఎస్టేట్ వ్యాపార భాగస్వామిని సైతం కలిసి అధికారపార్టీ నేతల సహకారం కోరినట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి పైకి గంభీరంగా ఉన్నప్పటికీ సాయంత్రం వరకూ హడావుడిగా తిరుగుతూ కనిపించడం గమనార్హం. అయితే నాలుగు రోజుల కిందటే గంజాయి సరుకు ఉన్న లారీని మహారాష్ట్రకు తరలించడంతో పత్తి వ్యాపారి ఊపిరి పీల్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల కోసమే 'వార్ధా' ప్రకటన

- తుమ్మిడిహెట్టి వద్దే ప్రాజెక్టు నిర్మించాలి
- జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్
- వార్ధా, ప్రాణహిత నదుల పరిశీలన



వార్ధా నదిని పరిశీలిస్తున్న సమితి సభ్యులు

కౌటాల(సిర్పూర్): రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసమే సీఎం కేసీఆర్ వార్ధా నదిపై బ్యారేజీ నిర్మిస్తామని రాజకీయ నాటకం ఆడుతున్నారని జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ ఆరోపించారు. కౌటాల మండలం వీర్దండి వద్ద వార్ధా నది, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అన్ని సర్వేలు చేసి, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరిట కమీషన్ల కోసం ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించిందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ కూడా లిఫ్ట్ ప్రాజెక్టులు సక్సెస్ కాలేదని, రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరంతో ఒక్క ఎకరానికి సైతం సాగునీరు అందించలేదని ఆరోపించారు. గ్రావిటీ ద్వారా నీళ్లందించే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులను సీఎం కేసీఆర్ మోసం చేశారన్నారు. సీఎం కేసీఆర్‌కు గజ్వేల్, సిద్దిపేట రైతులపై ఉన్న ప్రేమ ఉమ్మడి ఆదిలాబాద్ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేవలం ప్రాజెక్టు సర్వేల కోసమే రూ.38 కోట్లు ఖర్చు చేశారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేలకు రైతులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఆదిలాబాద్ అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ, బీసీ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కర్రే లచ్చన్న, రైతు సంఘం నాయకులు మోరేశ్వర్, బండు, శ్రీకాంత్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: మారుమూల గ్రామాల్లోని ప్రజలు వైద్యసేవలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం శాకన్‌గొంది గిరిజన గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన మెడికల్ యూనిట్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.2 కోట్ల విలువైన మొబైల్ మినీ ఆస్పత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వాహనంలో ఇప్పటివరకు 258 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. ప్రతీ మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సేవలందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జియోలాజికల్ సర్వే పూర్తి చేయాలి

- గిరి వికాస్ పకడ్బందీగా అమలు చేయాలి
- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: గిరి వికాస్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల భూముల జియోలాజికల్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవోలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న గిరి వికాస్ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల పొలాల్లో వ్యవసాయ బావులు తవ్వించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. రైతులు వ్యవసాయం చేసుకునేందుకు అనుకూలంగా అన్నిఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాకు 1,593 యూనిట్లు మంజూరయ్యాయని, వీటిలో ప్రతీ ముగ్గురు రైతులకు ఒక యూనిట్ చొప్పున అంగీకార పత్రాలు తీసుకుని అవసరమైన డాక్యుమెంట్లు సిద్ధం చేయాలన్నారు. మోటార్ల కొనుగోలుపై టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతీ ఆవాసానికి తాగునీరు అందించాలని ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

6న అద్దె గదుల బహిరంగ వేలం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ వాణిజ్య అద్దె గదులకు జూన్ 6న మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తొమ్మిది వాణిజ్య అద్దె గదులు నూతనంగా నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 29 నుంచి జూన్ 3 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.25వేల ధరావత్తు నగదు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే ఈ వేలంలో పాల్గొనవచ్చన్నారు. అద్దె గది పొందిన వారు 15 రోజుల్లో గుడ్‌విల్ రూ.2.04 లక్షలు చెల్లించకుంటే ఆ వేలంను రద్దు చేస్తామని వివరించారు.

సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న లోకేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రతీ పేదవాడికి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం వాంకిడి మండలం తేజాపూర్, ఇందాని గ్రామ మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 15 మండలాల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గృహలక్ష్మి పథకం కింద అర్హులకు రూ.3లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు మంజూరు చేయని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కమలాబాయి, శోభ, చిన్నబాయి, తానుబాయి, కమల, నిర్మల, సుగుణ, ఇంద్రాబాయి, సావిత్రిబాయి, మంజుల, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గంలో పయనించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: సమాజంలో ప్రతిఒక్కరూ బుద్ధుడి మార్గంలో పయనించాలని, శాంతి సామరస్యాలతో మెలగాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో అంబేడ్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిరత్న బుద్ధవిహార్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికీ చెడు చేయకుండా సన్మార్గంలో నడవాలని బుద్ధుడు బోధించాడన్నారు. భావి తరాలకు బుద్ధుడు, మహాత్మా జ్యోతిబా పూలే, సాహుజీ మహరాజ్, అంబేడ్కర్ వంటి మహనీయుల జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కుతోనే అణగారిన వర్గాలు రాజ్యాధికారం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినంత మాత్రాన దళితులు అభివృద్ధి చెందరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓట్లు అమ్ముకుని మోసపోవద్దని సూచించారు. అంతకు ముందు గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్ హుస్సేన్, నాయకులు వసంత్‌రావు, వెంకటేశ్, గీత, దేవిక, లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రాంటు కేటాయించాలి



మాట్లాడుతున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం గోలేటి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్మికులందరూ ఆందోళనలో పాల్గొని ఐక్యతను చాటుకోవాలని కోరారు. పంచాయతీ సిబ్బంది మొత్తాన్ని వెంటనే పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌ను వేతనంగా చెల్లించాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రతిపాదికన కాకుండా అవసరమైన చోట జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పంచాయతీ సిబ్బంది సరోజ, సుధాకర్, వార్డు సభ్యులు తిరుపతి, నాయకులు సాంబగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దహెగాం(సిర్పూర్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రీడాకారులకు గురువారం దహెగాం మండలకేంద్రంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో తోడ్పాడతాయన్నారు. క్రీడలతో స్నేహ బంధాలు మెరుగుపడతాయన్నారు. రెండు రోజులపాటు ఈ క్రీడల్లో 20 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సురేశ్, ఎస్సై సనత్‌కుమార్, సర్పంచ్ కృష్ణమూర్తి, జయేందర్, పీఈటీలు చక్రపాణి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న స్కూటీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని తిమ్మాపూర్‌లో తిరుపతి అనే వ్యక్తికి చెందిన స్కూటీ గురువారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం హోండా యాక్టీవా స్కూటీలో పెట్రోల్ ట్యాంక్ ఫుల్‌గా పోయించుకుని శుభకార్యానికి బయలుదేరాడు. మార్గమధ్యలో అకస్మాత్తుగా స్కూటీ నుంచి మంటలు చెలరేగడంతో వాహనం వదిలి దూరంగా పారిపోయాడు. స్కూటీ పూర్తిగా దగ్ధమైందని, సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుని వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం1పై మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, తెలుపు, నలుపు, సన్నని గీతలు గల ఫుల్‌షర్టు, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 9948481902, 9440700038 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గోదావరిలో...

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని ఇటిక్యాల గోదావరినదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గురువారం గోదావరి నదిలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లక్ష్మణ్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, సమాచారం తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కైరిగాంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన ముంజుం రాజేశం ఎద్దును రోజు మాదిరిగానే గురువారం ఉదయం మేత కోసం వదిలారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి విద్యుత్‌ను సరాఫరా చేసే సర్వీస్ వైరును పక్కనే ఉన్న టవర్‌కు కట్టారు. అయితే సర్వీస్ వైరు ఇన్సులేషన్ ఊడిపోయి ఉండడంతో టవర్‌కు వైర్లు తాకి విద్యుత్ సరఫరా అవుతోంది. అటుగా వెళ్లిన ఎద్దు టవర్‌కు తాకడంతో షాక్ తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రథమ చికిత్సలో పైలెట్

ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంలో 108 వాహనాల పైలెట్లు ప్రథములుగా గుర్తింపు పొందారు. అత్యవసర పరిస్థితులలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేరవేసి మెరుగైన వైద్య సేవలందిస్తూ పైలెట్లు పలువురి ప్రశంసలు పొందుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, పాముకాటుతో పాటు క్షణికావేశంలో పురుగుల మందు తాగిన సమయాల్లో సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాలకు క్షణాల్లో చేరుకుని క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడంలో 108 వాహన పైలెట్లు కీలక భూమిక పోషిస్తున్నారు. నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం సందర్భంగా కథనం.
– చెన్నూర్



108 అంబులెన్స్

సీపీఆర్ శిక్షణ పొందుతున్న పైలెట్

- ఆపదలో ఉన్నవారికి అత్యవసర సేవలు
- ఆస్పత్రులకు చేర్చడంలో వీరిదే కీలక పాత్ర
- నేడు జాతీయ పైలెట్ల దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు, పైలెట్ల వివరాలు

జిల్లా	వాహనాలు	పైలెట్లు
ఆదిలాబాద్	18	44
మంచిర్యాల	14	35
కుమురంభీం	12	28
నిర్మల్	08	19

విధుల్లో నిరంతరం అప్రమత్తం

ఎనిమిది గంటల విధుల్లో భాగంగా పైలెట్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రమాద జరిగిన సమాచారం అందిన వెంటనే క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకోవడంతో పాటు క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేయాల్సిన బాధ్యత పైలెట్లదే. వాహనం అదుపు తప్పనీయకుండా వాహనంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పైలెట్లు కృషి చేస్తున్నారు. ప్రతి వాహనంలో ఒక పైలెట్, ఒక ఈఎంటీ చొప్పున ఇద్దరు విధులు నిర్వహిస్తుంటారు. వాహనానికి వచ్చిన ఫోన్ కాల్ ప్రకారం సంఘటన స్థలానికి చేరుకోవడం వీరి కర్తవ్యం.

పైలెట్లకు సీపీఆర్ శిక్షణ

పైలెట్‌గా చేరిన తర్వాత ప్రథమ చికిత్స అందించడంలో శిక్షణ ఇవ్వడం మామూలే. ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువగా వస్తున్నాయి. సీపీఆర్ చేసి బాధితుల ప్రాణాలను కాపాడేందుకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణులకు అంబులెన్స్‌లో సుఖప్రసవం అయ్యే సమయంలో ఈఎంటీలకు ఎలా సహాయపడాలో శిక్షణ పొందారు.

తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటే..



గర్భిణులను108 వాహనంలో తీసుకువచ్చే సమయాల్లో ఎక్కువశాతం అంబులెన్స్‌లోనే ప్రసవం అయిన సంఘటనలున్నాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్న సందర్భాల్లో సంతోషం కలుగుతుంది.
– ఖలీల్, పైలెట్, కౌటాల, కుమురంభీం

క్షతగాత్రుల ప్రాణాలే ముఖ్యం



పదహారేళ్లుగా పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నా. ప్రమాద సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరవేసి ప్రాణాలు కాపాడడమే మా లక్ష్యం. ఎన్నో రకాల రోగులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు చేరవేశా. అంబులెన్స్‌లో విధులు నిర్వహించం సంతోషంగా ఉంది.
ఎం.శ్రీనివాస్, పైలెట్, చెన్నూర్

అప్రమత్తంగా ఉండాలి



108 వాహనంలో పైలెట్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. డ్యూటీ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ సమయంలోనైనా ప్రమాదం జరగవచ్చు. రాత్రి సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉంటేనే బాధితులను సకాలంలో సమీప ఆస్పత్రులకు చేరవేయవచ్చు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అందరి ప్రాణాలకు ముప్పే.- బి.సాయికిరణ్,పైలెట్, జైనథ్

ప్రాణాలతో బయటపడితే...



15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. కొన్ని రోడ్డు ప్రమాద కేసులు చూస్తే బాధ కలుగుతుంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు ఆర్తనాదాలు చేస్తుంటారు. పురుగుల మందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉంటారు. ఇలాంటి కేసుల్లో ప్రాణాలతో బయటపడితే సంతోషం కలుగుతుంది.
– తిరుపతి, పైలెట్, నిర్మల్

స్వగ్రామం చేరిన మృతదేహం

- శవపేటికతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

జన్నారం(ఖానాపూర్): ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లి అనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందిన జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన అంబటి అనంతయ్య (54) మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. గల్ఫ్ కార్మికులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

గల్ఫ్ కార్మికుల ధర్నా

మృతదేహం వస్తున్న విషయం తెలుసుకున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న, గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్‌లతో పాటు గల్ఫ్ కార్మికులు శవపేటికతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ కిషన్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, జేఏసీ రాష్ట్ర నాయకుడు పరికిపండ్ల స్వదేశ్, నాయకులు మగ్గిడి తిరుపతి, దుమల్ల ఎల్లయ్య, భీంరెడ్డి, మహేశ్, నరేంద్ర, నర్సయ్య, గోపాల్, పోశం, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బాలికల ప్రతిభ



ప్రతిభ చాటిన బాలికలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని నంబర్ -2 ఇంక్లైన్‌బస్తీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కరాటే బెల్టు టెస్ట్ పోటీల్లో పలువురు బాలికలు ప్రతిభ చాటారు. 10 సంవత్సరాల విభాగంలో శ్రీహిత ఆరెంజ్ బెల్ట్, 12 సంవత్సరాల విభాగంలో అద్దగూరి సంహిత, తెప్పల అవంతిక ఎల్లోబెల్ట్ సాధించినట్లు షిటోర్యూ కరాటే రాష్ట్ర అధ్యక్షుడు విజ్జగిరి రవి ప్రకటించారు.

గ్లైఫోసెట్ స్వాధీనం



పట్టుబడిన గ్లైఫోసెట్

దహెగాం(సిర్పూర్): మండలంలోని రాళ్లగూడలో అమ్మడానికి సిద్ధంగా ఉంచిన గ్లైఫోసెట్ (నిషేధిత గడ్డి మందు) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన వగాడె సంతోష్ ఇంట్లో తనిఖీ చేయగా 30 లీటర్ల గ్లైఫోసెట్ లభించిందన్నారు. దాని విలువ రూ.23 వేలు ఉంటుందన్నారు. గడ్డి మందును స్వాధీనం చేసుకుని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వందేభారత్ రైలును ఆపాలని లేఖ

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య త్వరలో ప్రారంభం కానున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సౌత్ సెంట్రల్ జీఎంకు లేఖ రాశారు. మంచిర్యాల అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతమని, వ్యాపారస్తులు నిత్యం హైదరాబాద్, నాగ్‌పూర్ వెళ్తారని, వారి సౌకర్యార్థం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన



ఆందోళన చేస్తున్న అశోక్ యాదవ్, నాయకులు

భీమారం(చెన్నూర్): రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కించపరుస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం హైదరాబాద్‌లో యాదవులతో పాటు కురుమ కులస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఒక మంత్రిపై ఇష్టానుసారంగా మాట్లాడడం బాధాకరమన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో గాంధీభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కంప్యూటర్ విద్యాబోధన ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ఆండాళమ్మకాలనీలో గురువారం వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో జిల్లా సివిల్‌సప్లై అధికారి ప్రేమ్‌కుమార్ కంప్యూటర్ విద్యాబోధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ విద్య నేర్చుకోవడం ద్వారా జీవితంలో త్వరగా స్థిరపడుతారన్నారు. జిల్లా వయోజన విద్య అధికారి ఆజ్మీర పురుషోత్తమ్‌నాయక్ మాట్లాడుతూ కంప్యూటర్ నైపుణ్యాలు నేర్చుకుని ఆధునిక కాలానికి తగినట్లుగా ఆదాయం పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాగర్ తనమిత్రుల సహకారంతో కంంప్యూటర్లు అందజేశారు. వయోజన విద్య కుమురంభీం జిల్లా అధికారి రమేశ్‌రెడ్డి, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం'

పాతమంచిర్యాల: బీసీలను విస్మరించే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పదవుల కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా కో కన్వీనర్ సంగం లక్ష్మణ్, తాడూరి శంకర్, కంచర్ల కొముురయ్య, కుదురుపాక పోషం పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

పాతమంచిర్యాల: జిల్లాలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన పెట్రోల్ బంకులను నిజామాబాద్ చీఫ్ రీజినల్ మేనేజర్ మందం శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులతో స్నేహపూరితంగా మెలగాలని సూచించారు. పట్టణంలోని పెట్రోల్ బంకులతో పాటు బెల్లంపల్లి, తాండూరు, దేవాపూర్, కోమటిచేను, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్‌లోని పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు.

భూసార పరీక్షలకు అనువైన సమయం



బావురావుపేటలో అవగాహన కల్పిస్తున్న ఏఈవో(ఫైల్)



జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

- రెండేళ్లకోసారి మట్టి నమూనాలు సేకరించాలి
- మోతాదులో ఎరువులు వాడితే అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడితే భూసారం దెబ్బతింటుందని, రైతులు తప్పనిసరిగా రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ జాడి బాపు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

భూసారం తెలుసుకోవాలి

భూసార పరీక్షలు చేయించడానికి ఇదే అనువైన సమయం. నేల తీరునుబట్టి మట్టి నమూనాలు సేకరించాలి. ఎత్తుపల్లాలు ఉన్న నేలల్లో వేర్వేరుగా నమూనాలు సేకరించాలి. నీరులేని ప్రదేశంలో, చెట్లనీడలో కాకుండా విస్తీర్ణంతో సంబంధం లేకుండా 7 నుంచి 8 చోట్ల చెత్తాచెదారం తీసివేసి వేర్లు లేకుండా 'వి' ఆకారంలో 15 సెంటీమీటర్ల లోతులో ఏటవాలుగా గుంత తీయాలి. అందులోంచి మట్టిని తీసి ఒక పాలిథిన్ సంచి మీద కుప్పగా పోసి నాలుగు భాగాలుగా చేయాలి. రెండు భాగాలను తీసివేస్తూ అరకిలో మట్టి వచ్చే వరకు ఈ నాలుగు భాగాల పద్ధతిని అనుసరించాలి. ఇలా సేకరించిన మట్టి నమూనాను గాలిలో ఆరబెట్టి ఒక కవరులో పోయాలి. దాని మీద రైతు పేరు, ఊరు, మండలం, జిల్లా, అంతకు ముందు వేసిన పంట, ఇక ముందు వేసే పంట వివరాలను రాసి భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి. వచ్చిన నివేదిక ఆధారంగా నేలలో సారం ఎంత ఉందో తెలుస్తుంది. తద్వారా భూసారం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకోవాలి. పంట సాగులో ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడులు వస్తాయి.

చరిత్రాత్మక ఒప్పందం సాధించాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్‌బోర్డులో మెరుగైన, చరిత్రాత్మక ఒప్పందం సాధించామని బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో కోల్‌కత్తాలో జరిగిన జేబీసీసీఐ 11వ సమావేశంలో బొగ్గు గని కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా వేతన ఒప్పందం సాధించామన్నారు. కోల్ ఇండియా యాజమాన్యంతో కొట్లాడి 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్ సాధించడంతో పాటు అన్ని అలవెన్స్‌లను ప్రస్తుతం ఉన్న దానికంటే 25 శాతం పెంచి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ అలవెన్స్ 11.25 శాతం, హెచ్ఆర్ఏ 2.5 శాతంకు పెంచడం జరిగిందన్నారు. పెరిగిన కొత్త వేతనాలు జూలైలో చెల్లించనున్నట్లు తెలిపారు. ఏరియర్స్ బకాయిలు కూడా త్వరలో ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు మాదాసి రవీందర్, మంచినీళ్ల స్వామి, జీడి ప్రభాకర్, కాదాసి భీమయ్య, మంద కమలాకర్, సురేష్, తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు ఘనస్వాగతం



రేవయ్య, అతని తల్లి విస్తారుబాయిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): యూపీఎస్సీ ఫలితాల్లో సివిల్స్ ఆలిండియా 410 ర్యాంకు సాధించిన రెబ్బెన మండలంలోని తుంగెడకు చెందిన డోంగ్రి రేవయ్యకు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయంలో రేవయ్య, అతని తల్లి విస్తారుబాయిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ం నుంచి బస్టాండ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ ర్యాలీలో పాల్గొని రేవయ్యను అభినందించారు. గురుకులాల్లో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచులు చెన్న సోమశేఖర్, డోంగ్రి పెంటయ్య, మాధవి, శాంత, ఎంపీటీసీలు సంఘం శ్రీనివాస్, సాగరమ్మ, టీఆర్ఎస్ నాయకులు ఆనంద్, రవీందర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సురేశ్

మంచిర్యాలటౌన్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఆర్‌కె 6లో సింగరేణి కార్మికులు నిర్మించుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని భారత జాగృతి విద్యార్థి విభాగం నాయకుడు తోకల సురేష్ యాదవ్ గురువారం తెలంగాణ రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరి రామ్మోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గతంలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న కార్మిక, కార్మికేతర కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. కానీ నస్పూరులోని 5వ వార్డు దళిత కాలనీలో దాదాపుగా 800ల ఇళ్లు కనీసం సర్వే కూడా చేయలేదన్నారు. వెంటనే సర్వే జరిపించి న్యాయం చేయాలని కోరారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పారదర్శకంగా కంపెనీ క్వార్టర్లు కేటాయిస్తున్నామని పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. ఏరియాలోని ఖాళీ క్వార్టర్లకోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో గల పర్సనల్ డిపార్టుమెంట్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సింగరేణి క్వార్టర్లకోసం 35 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, కౌన్సిలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్లు కేటాయిస్తున్నామన్నారు. క్వార్టర్ల కోసం ఉద్యోగులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. సంస్థ కేటాయించిన క్వార్టర్లల్లో ఉద్యోగులు నివాసం ఉండకుండా అద్దెకిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగరేణి ఖాళీ క్వార్టర్లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ తిరుమల పాల్గొన్నారు.